సాక్షి
వనపర్తి
ఆదివారం । 7 । జనవరి । 2024



16 ఇళ్లలో చోరీలు
వెల్దండ మండలం కొట్రలో ఒకేసారి 16 ఇళ్లలో దొంగలు చోరీలకు పాల్పడ్డారు.
వివరాలు 8లో ▸



నకి'లీలలు'..!
గ్రామాల్లో కొందరు వచ్చీరాని వైద్యం చేస్తూ ప్రజలను నిలువునా ముంచుతున్నారు.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.9 /15.1

వాతావరణం
ఉదయం, రాత్రి వేళ మంచు అధికంగా కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి. చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రామసభల్లోనే అర్హులను ఎంపిక చేయాలి



పాన్‌గల్: ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి అభయహస్తం దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రేమద్దులలో ఉన్న పార్టీ కార్యాలయంలో అమరజీవి కామ్రేడ్ వనగంటి ఈశ్వర్ క్యాలెండర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి పక్షపాతం చూపొద్దని, కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. గతంలో చాలామంది మహిళలు అభయహస్తం పథకానికి డబ్బులు చెల్లించారని.. తిరిగి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటయ్య, ఆంజనేయులు, ఖాజా, భాస్కర్‌గౌడ్, నిరంజన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

12న 'చలో పార్లమెంట్'



వనపర్తిటౌన్: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 12న చలో పార్లమెంట్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయకార్యదర్శి డి.కిరణ్ తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన జిల్లా కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై చలో పార్లమెంట్ వాల్‌పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠ్యపుస్తకాల్లో మతోన్మాద భావజాలాన్ని చేరుస్తూ కాషాయీకరణ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయోద్యమంతో సంబంధం లేని హెగ్డేవార్, విడి సావర్కర్ల చరిత్రను పాఠ్య పుస్తకాల్లో పొందుపరుస్తున్నారని విమర్శించారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు కనీస నిధులు కేటాయించడం లేదని, బహుళజాతి కంపెనీల ప్రైవేట్ యూనివర్సిటీలను ఆహ్వానిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నీరుగార్చే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది, జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి, నాయకులు మల్లేష్, నంద కిషోర్, ప్రవీణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాపాలన

జిల్లావ్యాప్తంగా 2,02,698 దరఖాస్తులు



పాంరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

- చివరిరోజు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నుడిగాలి పర్యటన.. అమరచింత మండలం పాంరెడ్డిపల్లి గ్రామసభలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్
- కొనసాగుతున్న కంప్యూటరీకరణ

వనపర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కోసం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు శనివారం ముగిశాయి. ఎనిమిది రోజుల పాటు జిల్లావ్యాప్తంగా 255 గ్రామపంచాయతీలు, ఐదు పురపాలికల్లోని 80 వార్డుల్లో కౌంటర్లు ఏర్పాటు చేసి అభయహస్తం దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసే సమయానికి 14 మండలాల నుంచి 1,63,044, ఐదు మున్సిపాలిటీల్లో 39,654 మొత్తం 2,02,698 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ వెల్లడించారు. అత్యధికంగా పాన్‌గల్ మండలంలో 17,030, అత్యల్పంగా అమరచింత మండలంలో 5,848 దరఖాస్తులు వచ్చాయని.. అలాగే పురపాలికల్లో అత్యధికంగా వనపర్తిలో 19,410, అత్యల్పంగా అమరచింత పురపాలికలో 3,679 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వివరించారు.

ఇతర సమస్యలపై 35,330..
గ్రామసభల్లో ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర సమస్యలపై కూడా దరఖాస్తులు వేలల్లో రావడం గమనార్హం. అధికారుల లెక్కల ప్రకారం ఎనిమిది రోజుల్లో ఇతర దరఖాస్తులు 35,330 దాఖలయ్యాయి. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలంటూ వచ్చిన దరఖాస్తులే 90 శాతం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు..

అమరచింత: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడానికి ప్రభుత్వం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తోందని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో శనివారం జరిగిన ప్రజాపాలన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలగొద్దనే గ్రామసభల కౌంటర్లలో దరఖాస్తు ఫారాలను ఉచితంగా అందిస్తున్నారని వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ లబ్ధి చేకూరేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మార్క సరోజ, సర్పంచ్ పావని, ప్రత్యేక అధికారి స్వరణ్‌సింగ్, తహసీల్దార్ చాంద్ పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు
పాన్‌గల్	17,030
ఖిల్లాఘనపురం	16,160
వనపర్తి	14,924
గోపాల్‌పేట	14,909
పెద్దమందడి	14,726
కొత్తకోట	13,454
పెబ్బేరు	13,040
వీపనగండ్ల	10,072
చిన్నంబావి	10,049
మదనాపురం	9,683
ఆత్మకూరు	9,158
రేవల్లి	7,484
శ్రీరంగాపూర్	6,507
అమరచింత	5,848
మున్సిపాలిటీల వారీగా..	
వనపర్తి	19,410
కొత్తకోట	6,079
పెబ్బేరు	5,752
ఆత్మకూరు	4,734
అమరచింత	3,679

13వ తేదీలోగా డిజిటలైజేషన్ పూర్తి..
జిల్లావ్యాప్తంగా వచ్చిన అభయహస్తం దరఖాస్తులను 500 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లతో డిజిటలైజేషన్ ప్రక్రియను శుక్రవారం కలెక్టర్ తేజస్ పవార్ ప్రారంభించారు. ఈ నెల 13వ తేదీలోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయమై మాస్టర్ ట్రైనర్ డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కూడా ఇచ్చారు.

అభివృద్ధి దిశగా కలిసి నడుద్దాం



జిల్లాకేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

బీఆర్‌ఎస్ పాలనలో ప్రతిపక్షాలను చిన్నచూపు చూశారని.. కాంగ్రెస్ పాలనలో ముందుచూపుతో అభివృద్ధి దిశగా కలిసి నడుద్దామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రజాపాలన చివరిరోజు శనివారం జిల్లాకేంద్రంలోని 8వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పాలకులు కాంగ్రెస్‌పార్టీ ప్రజాప్రతినిధులున్న ప్రాంతాల్లో అభివృద్ధిని విస్మరించారని.. అందుకు జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్న వార్డులే నిదర్శనమన్నారు. పట్టణాభివృద్ధికి మంజూరైన నిధులను తిరిగి పంపించకుండా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుందామని కోరారు. ఇదివరకు మంజూరైన నిధులు, అభివృద్ధి పనులను కొనసాగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించామని.. సుముఖత చూపించినట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాధిద్దామని పిలుపునిచ్చారు. రహదారి విస్తరణ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, డ్రెయినేజీ తదితర సమస్యలపై పూర్తి నివేదిక అందజేయాలని పుర కమిషనర్ విక్రమసింహారెడ్డిని కోరారు.

రాయితీ గొర్రెల డబ్బులు వాపస్..
గత ప్రభుత్వ హయాంలో రాయితీ గొర్రెల పథకానికి డబ్బులు చెల్లించి గొర్రెలు రాని వారు దరఖాస్తు చేసుకుంటే తిరిగి ఇచ్చేలా కలెక్టర్‌తో మాట్లాడానని ఎమ్మెల్యే మేఘారెడ్డి చెప్పారు. అనంతరం పెద్దగూడెం, రాజపేట, చిమనగుంటపల్లి, రేవల్లి తదితర ప్రాంతాల్లో జరిగిన గ్రామసభల్లోనూ ఎమ్మెల్యే పాల్గొని ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని అభయహస్తం దరఖాస్తులు స్వీకరించారు.

తప్పులు లేని ఓటరు జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ పవార్.. హాజరైన అదనపు కలెక్టర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

కలెక్టర్ తేజస్ పవార్

వనపర్తి: తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ తేజస్ పవార్ కోరారు. 2024 స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై శనివారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముసాయిదా ఓటరు జాబితాను శనివారం సిద్ధం చేశామని.. రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. ఓటరు జాబితాలో పేర్లను పరిశీలించుకొని ఏవైనా తప్పులుంటే సరిదిద్దుకోవడానికి అవకాశం ఉంటుందని.. ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రచురిస్తామని వివరించారు. ముసాయిదా జాబితాలోని తప్పులను సరి చేసేందుకు ఈ నెల 22 నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఈ మధ్యకాలంలో ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు. మృతిచెందిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని గుర్తించి తగిన ఆధారాలతో జాబితా నుంచి తొలగిస్తామన్నారు. మరణ ధ్రువీకరణ పత్రం లేని పక్షంలో స్థానిక సంస్థల కార్యాలయాల్లోని రిజిస్టర్లలో నమోదైన జనన మరణ వివరాలను పరిగణలోకి తీసుకొని పూర్తి విచారణ అనంతరం తొలగించనున్నట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీలు స్వయంగా బూత్ లేవల్ ఏజెంట్లను నియమించుకోవాలని, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కేంద్రాల పేర్లు మార్పు ఉంటే ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తుతం ఉన్న బీఎల్వోల పని తీరును సమీక్షించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎస్.తిరుపతిరావు, కాంగ్రెస్ తరుపున త్రినాథ్, బీఆర్‌ఎస్ తరుపున సయ్యద్ జమీల్, బీజేపీ నాయకుడు శ్రావణ్, శ్రవణ్, సీపీఎం నాయకుడు పరమేశ్వరాచారి పాల్గొన్నారు.

పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

వనపర్తిటౌన్: పట్టణాభివృద్ధికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని.. విభేదాలు వీడాలని మున్సిపల్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ కోరారు. శనివారం పట్టణంలోని 15వ వార్డులో ఎస్‌డీసీ నిధులు రూ.24 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి కౌన్సిలర్లతో కలిసి భూమిపూజ చేసి మాట్లాడారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని, ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వనపర్తి అభివృద్ధికి తనదైన శైలిలో బాటలు వేశారని, ఆ పరంపర కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారు కృష్ణ, పాకనాటి కృష్ణ, కంచె రవి, బీఆర్‌ఎస్ నాయకులు ఉంగ్లం తిరుమల్, ఎల్‌ఐసీ కృష్ణ, స్టార్ రహీం, శరవంద, యుగంధర్‌రెడ్డి, విష్ణుసాగర్, ఇంజినీర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పుర చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ శ్రీధర్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో గద్వాలలో గ్రూప్–1 ,2 ,3, 4 ఉచిత శిక్షణకు ఆసక్తి, డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత https://studycircle.cgg.gov.in/tsbcw/index.do వెబ్‌సైట్‌లో ఈ నెల 8 నుంచి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 08546-293022, 99085 60268 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

మాజీ అడ్వొకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి

అమరచింత: రాజకీయాలకు అతీతంగా పట్టణ ప్రజలు, యువకులు సంఘటితంగా ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమని మాజీ అడ్వొకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణాభివృద్ధి కోసం శనివారం పట్టణంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆయనతో పాటు టీపీసీసీ అధికార ప్రతినిధి, గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ఆస్పత్రిని పీహెచ్‌సీగా ఉన్నతీకరించేందుకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సహకారం తీసుకోవాలని, ఇందుకు కాంగ్రెస్ నాయకులు చొరవ చూపాలని కోరారు. గత ప్రభుత్వ హయంలో ఎన్నో ప్రయత్నాలు చేసినా అనివార్య కారణాలతో సాధ్యం కాలేదన్నారు. డంపింగ్‌యార్డు మార్పు, మురుగు కాల్వలు, టౌన్‌హాల్ నిర్మాణం, గ్రంథాలయం, 11 కేవీ లైన్ మార్పునకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాజన్న, అయూబ్‌ఖాన్, నర్సింహులుగౌడ్, కురుమన్న, శామ్యూల్, మస్తమని, ఎస్‌ఏ రాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, పోసిరిగారి విష్ణు, కలాంపాషా, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ అడ్వొకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి

నెత్తుటి మరకలు

- జాతీయ రహదారిపై పెరుగుతున్న భారీ ప్రమాదాలు
- మృత్యుకూడళ్లుగా బాలానగర్, రాజాపూర్ స్టేజీలు
- నిత్యం దుర్ఘటనలతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- కారణమవుతున్న మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్
- భద్రత చర్యలు చేపట్టడంలో అధికారుల విఫలం



44వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న బాలానగర్ కూడలి

మహబూబ్‌నగర్ క్రైం/ జడ్చర్ల: జాతీయ రహదారులపై మృత్యుఘంటికలు మోగుతున్నాయి. మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, నిద్రమత్తు.. వాహనం కండిషన్‌లో లేకపోవడం వంటి కారణాలతో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటుచేసుకుని ఎంతో మంది మృత్యువాత పడుతుండగా.. మరెందరో క్షతగాత్రులుగా మిగులుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తూరు నుంచి అలంపూర్ చౌరస్తా వరకు 185 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉంది. వీటిపై గంటకు 80 – 130 కి.మీ. వేగంతో వాహనాలు వెళ్తుంటాయి. వీటికి తోడు నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారులపై ఎక్కడబడితే అక్కడ లారీలు ఇతర వాహనాలను నిలుపుతుండటంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీనికితోడు రహదారుల నిర్మాణంలో ప్రమాణాలు పాటించకపోవడం, భద్రతా చర్యలను గాలికొదిలేయడంతో నిండు ప్రాణాలు నడిరోడ్డుకు బలవుతున్నాయి.

కనిపించని స్పీడ్ గన్స్
రహదారులపై పరిమితికి మించి వేగంగా వెళ్లిన వాహనాలను గుర్తించి జరిమానా విధించేందుకు వీలుగా స్పీడ్‌గన్స్ ప్రవేశపెట్టారు. గంటకు 140 కి.మీ., వేగంతో వెళ్తున్న వాహనాన్ని వీటితో గుర్తించవచ్చు. వేగంగా వస్తున్న వాహనాలను 100 మీటర్లలోకి వచ్చిన తర్వాత స్పీడ్ గన్‌లో ఆపరేటర్ చూస్తే వాహనం, నంబర్, ఫొటో వేగం నమోదవుతుంది. ఇలాంటి సదుపాయం ఉన్న స్పీడ్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఫలితాలు రావడం లేదు. దీనికి తోడు రోడ్డుపై ఏర్పాటు చేసిన డివైడర్ల ఎత్తు తగ్గడంతో అవతలి వైపు నుంచి వచ్చే వాహనాల ఇవతలి రోడ్డుపైకి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాయి.

సకాలంలో అందని వైద్యం..



బూరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన కారు

జాతీయ రహదారులపై ప్రమాదాల బారినపడి గాయపడే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించడంలోనూ ఆలస్యమవుతుంది. ఇక్కడి నుంచి ఎక్కువగా మహబూబ్‌నగర్ సమీపంలోని ఎస్‌వీఎస్, జనరల్ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. దీంతో అనేక మందికి సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. అలాగే వివిధ రకాల కారణాలతో ఆస్పత్రులకు తరలించడంలోనూ కొంత ఆలస్యం అవుతోంది. ప్రమాదం జరిగిన మొదటి గంటలోనే (గోల్డెన్ అవర్) ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు నిలిచే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో జడ్చర్లలో కొత్తగా ఏర్పాటు చేసిన వంద పడకల ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి, వైద్య చికిత్సకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. అలాగే జడ్చర్లలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది.

ప్రమాదకర ప్రాంతాలు..
ఉమ్మడి జిల్లాలో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాలను ఆర్టీఏ, పోలీస్ అధికారులు గుర్తించారు. వాటిలో షాద్‌నగర్ ఎక్స్‌రోడ్, రాయికల్, బాలానగర్, బాలానగర్ చౌరస్తా దగ్గర, రాజాపూర్, ముద్దిరెడ్డిపల్లి, గొల్లపల్లి, కావేరమ్మపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, జడ్చర్ల, భూత్పూర్ మునిరంగస్వామి ఆలయం, బూరెడ్డిపల్లి, మల్లెబోయినిపల్లి, దివిటిపల్లి, జానంపేట, వేముల, కందూర్, అడ్డాకుల, వెల్టూర్, మోజర్ల, కనిమెట్ట, పాలెం, రాణిపేట ఎక్స్‌రోడ్, బీచుపల్లి, ఎర్రవల్లి ఎక్స్‌రోడ్, కొట్టం ఇంజినీరింగ్ కళాశాల, జింకలపల్లి, నారాణపురం, బోరవెల్లి స్టేజీ దగ్గర నిత్యం ఏదో ఒక్క ప్రమాదం జరుగుతుంది.
– ఇటు జాతీయ రహదారి–167పై గల కొత్తతండా, శంకరాయపల్లితండా, గంగాపూర్ శివారులోని పత్తి మార్కెట్ యార్డు, మిడ్జిల్, ఊర్కొండ వద్ద బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి. అలాగే ఈ రహదారిపై కావేరమ్మపేట, కుర్వగడ్డపల్లి, రాణిపేట, మిడ్జిల్, బోయిన్‌పల్లి గ్రామాల్లో వారాంతపు సంతలు జరుగుతాయి.

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి..



జాతీయ రహదారిపై వాహనాలు అతివేగంగా వెళ్తుంటాయి. బాలానగర్ వద్ద రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు. వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి. అలాగే ప్రమాదాల నివారణకు ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించే విధంగా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలి. – సతీష్, బాలానగర్

అతివేగం కారణంగానే..



రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. అతివేగం కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేగాక ప్రజలు వచ్చిపోయే వాహనాల వేగాన్ని అంచనా వేయకుండా రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. వేగ నియంత్రణకు ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు చేపడతాం. – రమేశ్‌బాబు,సీఐ, జడ్చర్ల

సంత నిర్వహించొద్దు..
జాతీయ రహదారిపై ఉన్న చౌరస్తాలు, జంక్షన్స్ దగ్గర ఉన్న డివైడర్ ఓపెన్ ఉండరాదు. టెక్నికల్ బ్లాక్ స్పాట్ కావడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి. జాతీయ రహదారిపై సంత నిర్వహించొద్దు. వారాంతపు సంతను అక్కడి నుంచి తరలించేందుకు అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాం. బారికేడ్లు, స్టాపర్స్ కూడా బ్లాక్ స్పాట్లలో ఏర్పాటు చేస్తాం. జాతీయ రహదారి అథారిటీ బాధ్యతగా నడుచుకోవాలి. రక్షణ కోసం చర్యలు తీసుకోవాలి. రాంగ్ రూట్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్‌పై దృష్టి సారిస్తాం. – మహేష్, డీఎస్పీ, మహబూబ్‌నగర్

ఆర్టీసీలో సంక్రాంతి సందడి

- రీజియన్‌లో నేటి నుంచి 420 అదనపు సర్వీసులు
- ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు



స్టేషన్ మహబూబ్‌నగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలో 420 అదనపు బస్సు సర్వీసులు నడపనుంది. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పండుగ వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు బస్సులు నడపనున్నారు. రీజియన్‌లోని

తొమ్మిది డిపోల నుంచి
అదనపు బస్సు సర్వీసులు నడపడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం నుంచి ఈ నెల 15 వరకు ఈ అదనపు బస్సులు నడవనున్నాయి. అన్ని డిపోల నుంచి హైదరాబాద్ రూట్లో ఎక్కువగా ప్రయాణికుల రద్దీ ఉంటుంది. దీంతో రీజియన్‌లోని తొమ్మిది డిపోల నుంచి ఎక్కువ సంఖ్యలో అదనపు బస్సులు హైదరాబాద్ వరకు తిరగనున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ మీదుగా ఏపీలోని పలు ప్రాంతాలకు అదనపు బస్సులు (సూపర్ లగ్జరీ) నడపనున్నారు. పండుగ నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని డిపోల నుంచి అదనపు బస్సులు నడిపిస్తున్నామని రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణికుల రద్దీని బట్టీ మరిన్ని బస్సులు నడపడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తేదీల వారీగా ఇలా..
సంక్రాంతి పండగ నేపథ్యంలో ఆదివారం నుంచి స్పెషల్ బస్సుల సర్వీసులు మొదలవుతాయి. ఈ క్రమంలో ఆదివారం 40, సోమవారం 40, మంగళవారం 30, బుధవారం 50, గురువారం 60, శుక్రవారం 80, శనివారం 60, వచ్చే ఆదివారం 30, వచ్చే సోమవారం 30 అదనపు బస్సు సర్వీసులను నడపనున్నారు.

క్లుప్తంగా

పొలానికి వెళ్తుండగా..

బైక్‌పై నుంచి పడి రైతు దుర్మరణం

బల్మూర్: వ్యవసాయ పొలానికి వెళ్తూ ప్రమాదవశాత్తు బైక్ బోల్తా పడి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని గోదల్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదల్ చెందిన పంబ బాలరాజ్(39) తన వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటకు బోరు మోటార్ ఆన్ చేయడానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలరాజ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన ఎంతకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం మార్గంలో వెళ్లి చూడగా బైక్ ప్రమాదానికి గురై మృతి చెంది ఉన్నాడు. మృతుడు బీఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. ఘటనపై భార్య అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది..

- ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవాబుపేట: ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం... రుద్రారం గ్రామానికి చెందిన ఇప్ప యాదయ్య(46), అతడి భార్యతో కుటుంబ సంబంధ విషయాల్లో రెండు రోజులుగా గొడవ పడ్డాడు. కాగా అతడి తల్లి అంజమ్మ శుక్రవారం వారిద్దరికీ సర్దిచెప్పి ఇంటికి పంపించింది. అయినప్పటికీ తగాదాలతో మనస్తాపానికి గురైన యాదయ్య శనివారం ఉదయం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు అతడి తల్లికి సమాచారం ఇచ్చారు. ఘటనపై ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఆనంద్ తెలిపారు.

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

వేరుశనగలో ధాతువు లోపాలను నివారిద్దాం



ఇనుము లోపం ఉన్న వేరుశనగ పైరు

అలంపూర్: రైతులు ఈ ఏడాది వేరుశనగ పంట ఒక మోస్తారుగా సాగు చేయడం జరిగింది. ప్రస్తుతం సాగులో ఉన్న పంటల్లో జింకు, ఇనుము ధాతువు లోపాలు కనిపిస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. ఈ లోపనివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వేరుశనగలో ధాతువు లోపాలను ఈ విధంగా రైతులకు వివరించారు.

జింకు లోపానికి కారణాలు..

- భాస్వరం ఎరువుల వాడకం ఎక్కువగా ఉన్నప్పుడు
- ఉదజని సూచిక 7.0 దాటినప్పుడు
- భూమిలో మెగ్నీషియం అధిక మోతాదులో ఉన్నప్పుడు జింకు లోపానికి కారణాలు

జింకు లోప లక్షణాలు

ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు కొమ్మలు చిన్నవిగా మారడం జరుగుతుంది.

నివారణ: జింకు లోప నివారణకు ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్ ప్రతి మూడు పంటలకు ఒకసారి భూమిలో వేయాలి. పంట దశలో లోపం కనిపిస్తే చీలేటెడ్ జింక్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

ఇనుము ధాతువు లోపం

ఇనుము లోపం కనిపించినప్పుడు ఆకులు ఇనెలు పచ్చగా ఉండి మిగిలిన భాగాలు పసుపు రంగులోకి మారుతాయి. దీని వలన కిరణ జన్య సంయోగ క్రియ సరిగ్గా జరగదు.

నివారణ :

ఫెర్రస్ సల్ఫేట్ లేదా అన్న భేడి 2 గ్రాములు, నిమ్మ, ఉప్పు 1 గ్రాము, యూరియా 10 గ్రాములు లీటరు నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.



జింకు లోపం ఉన్న పైరు

■ మోతీఘనపూర్‌లోని వంగూరి రాజు భార్యాకూతురు మృతదేహాలు గ్రామానికి చేరుకోగానే అప్పటికే బంధుమిత్రులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. శోకసంద్రంలోనే మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించగా 'నేను ఎందుకు బతికాను.. దేవుడా' అంటూ సునీత భర్త రాజు రోదనలు అక్కడున్న వారిని కలచివేసింది. ఒకేసారి తల్లికూతురు మృతిచెందడంతో గ్రామస్తులు పెద్దఎత్తున అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

■ అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకును.. దేవుడు తిరిగిరాని లోకాలకు తీసుకెళ్లాడంటూ బాలానగర్‌కు చెందిన చిల్కమర్రి నర్సింహులు, భార్య సుగుణ రోదనలు చూపరులతో కంటతడి పెట్టించాయి. శుక్రవారం జశ్వంత్ జన్మదినం కావడంతో మిత్రులకు చాక్లెట్లు పంచిపెడదామని రోడ్డు దాటుతుండగా ఇంతలో ఘోరం జరిగిపోయిందని బోరున విలపించారు. గతేడాది చిన్న కూతురు పావని(15) అనారోగ్యంతో మృతిచెందగా.. ప్రస్తుతం పెద్ద కూతురు మాత్రమే ఉన్నారు. కన్న కూతురు మృత్యువాత పడిన ఏడాదిలోపే అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు కూడా దేవుడి దగ్గరకు వెళ్లిపోయాడని వాపోయారు.

■ సంతకు వచ్చి మృత్యుఒడికి చేరిన పన్నీ, మనుమరాలు జున్ను మృతదేహాలు తండాకు చేరుకోవడంతో బంధువులు శోకసంద్రంలో మునిగింది. కుటుంబ సభ్యులు, బంధువులు తరలిరావడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా.. క్షతగాత్రురాలు మౌనిక ఆస్పత్రిలోనే తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుంది. అన్ని గ్రామాలకు చేరుకున్న మృతదేహాలకు బంధువులు శనివారం సాయంత్రమే అంత్యక్రియలు పూర్తిచేశారు.

నేనెందుకు బతికాను.. దేవుడా

- శోకసంద్రంలో బాలానగర్ ప్రమాద మృతుల కుటుంబాలు
- జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి
- కుటుంబ సభ్యులకు మృతదేహాల అప్పగింత
- స్వగ్రామాల్లో అంత్యక్రియల నిర్వహణ
- బాధితులను పరామర్శించిన ఎంపీ, ఎమ్మెల్యేలు



మోతీఘనపూర్‌లో వంగూరు సునీత కుమారుడు అభిలాష్‌ను పట్టుకుని రోదిస్తున్న అత్త జంగమ్మ

మహబూబ్‌నగర్ క్రైం/ బాలానగర్: బాలానగర్ శుక్రవారం సాయంత్రం జరిగిన ఘోర ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. ప్రమాదంలో బాలానగర్‌కు చెందిన చిల్కమర్రి నర్సింహులు కుమారుడు జశ్వంత్, మోతీఘనపూర్‌కు చెందిన తల్లికూతుళ్లు వంగూరు సునీత, మోక్షిత, రాజాపూర్ మండలం బీబీనగర్ తండాకు చెందిన పన్నీ, మనుమరాలు జున్ను మృతిచెందగా.. మధ్యప్రదేశ్‌కు చెందిన భద్రుసింగ్, బీబీనగర్‌తండాకు చెందిన మౌనిక, వంగూరు రాజులకు తీవ్రగాయాలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఐదుగురి మృతదేహాలకు శనివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో జనరల్ ఆస్పత్రిలోని పోస్టుమార్టం పూర్తిచేశారు. ఆ తర్వాత మూడు ప్రత్యేక అంబులెన్స్‌లలో మృతదేహాలను బాధితుల స్వగ్రామాలకు తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మౌనికకు జనరల్ ఆస్పత్రి వైద్యులు సర్జరీ చేసి ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. అయితే మృతులకు సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మహబూబ్‌నగర్ డీఎస్పీ టి.మహేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఆర్‌డీఓ అనిల్‌కుమార్ మృతదేహాల తరలింపు, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆస్పత్రి దగ్గర టెన్షన్ వాతావరణం కనిపించింది.



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ప్రజాప్రతినిధుల పరామర్శ



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మౌనికను ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 వేల ఆర్థిక సహాయం వ్యక్తిగతంగా అందిస్తానన్నారు. మౌనికకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవన్‌కు సూచించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూస్తానని చెప్పారు. అనంతరం పోస్టుమార్టం భవనం ఆవరణలో మృతదేహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మృతుల అంత్యక్రియల కోసం ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు.

కన్ననూర్‌లో ఉద్రిక్తత

యువకుడి మృతిపై బంధువుల ఆందోళన



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

అడ్డాకుల: మండలంలోని కన్ననూర్‌లో ఓ యువకుడి మృతి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. గుంటి శ్రీనివాసులు(29) మృతికి అదే గ్రామానికి చెందిన కొందరు కారణమంటూ బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం మృతదేహంతో ఆందోళన చేయడానికి యత్నించడం ఆందోళన రేకెత్తించింది. కొన్నాళ్ల కిందట గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గొడవపడుతుండగా మధ్యలో వెళ్లి విడిపించడానికి శ్రీనివాసులు యత్నించాడు. ఈక్రమంలో శ్రీనివాసులుపై పోలీసు కేసు పెట్టించారని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఇటీవల గ్రామంలో రాజీ కుదిర్చే ప్రయత్నం జరిగిందని, మృతుడు శ్రీనివాసులు గత నెల 30న కోర్టుకు వెళ్లి వస్తుండగా మానసిక క్షోభతో మెదడులో రక్తనాళాలు పగిలిపోయి కిందపడటంతో ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఈనెల 5న చనిపోవడంతో అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేస్తూ బాధ్యుల ఇళ్ల వద్ద ఆందోళనకు దిగారు. సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ మొదల శ్రీనివాస్‌సాగర్ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఇదిలా ఉండగా శ్రీనివాసులు మృతికి కారణమయ్యారంటూ గ్రామానికి చెందిన సుజీవన్‌రెడ్డి, తెలుగు శేఖర్, తాజొద్దీన్, ఖదీర్‌పై పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శ్రీనివాసులు మృతదేహానికి శవ పరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మిరపతోటలో 'గంజాయి' సాగు



గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

మద్దూరు: గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మండల పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మద్దూరు ఎస్ఐ సురేష్ కథనం ప్రకారం.. కొత్తపల్లికి చెందిన మున్నూరు నర్సింహులు తన వ్యవసాయపొలంలో మిరపతోట సాగు చేస్తున్నాడు. అందులోనే గుట్టుచప్పుడు కాకుండా గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. గమనించిన కొందరు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు విషయం చేరవేశారు. దీంతో వారు సమాచారం అందించగా కోస్గి సీఐ జనార్దన్, కొత్తపల్లి తహసీల్దార్ అనిల్ కుమార్ ఇతర సిబ్బంది అక్కడికి చేరుకొని మొక్కలను పీకివేశారు. 1.315 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

50 గ్రాముల ఎండు గంజాయి సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: అక్రమంగా గంజాయి నిల్వ ఉంచుకొని విక్రయించే వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని మోతీనగర్ శనివారం చేసిన తనిఖీల్లో ఖాజపాష అనే వ్యక్తి దగ్గర 50 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించి, 50 గ్రాముల ఎండు గంజాయి సీజ్ చేసినట్లు తెలిపారు. ఖాజపాషపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.ఈ దాడులలో ఎస్ఐలు నరేష్‌రెడ్డి, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు



ఎక్సైజ్ పోలీసుల అదుపులో గంజాయితో పట్టుబడిన ఖాజపాష

గుడిగండ్లలో 420గ్రా. గంజాయి పట్టివేత

మక్తల్: విక్రయించేందుకు తీసుకొచ్చిన 420గ్రాముల గంజాయిని ఓ యువకుడి నుంచి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో శనివారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామ శివారుల్లో జాతీయ రహదారి పక్కన ఉన్న ఒడిశాకు చెందిన ప్రబిననాయక్‌ను అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. ఆయన వద్ద ఉన్న కవర్‌లో 420 గ్రాముల గంజాయి ఉండడంతో దాన్ని స్వాధీనం చేసుకుని మక్తల్ పోలీసులకు అప్పగించారు. నిందితుడు నాలుగేళ్లుగా గుడిగండ్ల శివారుల్లో ఇటుకబట్టీల్లో పనిచేస్తున్నారని, అతని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పర్వతాలు, మక్తల్ ఎస్ఐ పర్వతాలు పేర్కొన్నారు.

నేత కార్మికుడికి రూ.2.78 లక్షల విద్యుత్ బిల్లు


Southern Power Distribution company ...
104142768
Bill Details HIDE
Customer Name : A.Ch.Mallappa
Bill Number : 0221201602
Bill Date : 11-Dec-2023
₹ 2,78,500

వచ్చిన విద్యుత్ బిల్లు

రాజోళి: చేనేత కార్మికుడికి రూ.లక్షల్లో విద్యుత్ బిల్లు వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన మల్లికార్జున్ మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నారు. 2022లో ఈయన ఇంటి విద్యుత్ మీటర్ కాలిపోయింది. దాని స్థానంలో కొత్తది బిగించినప్పటి నుంచి బిల్లు అధికంగా వస్తుందని వినియోగదారుడు వాపోతున్నారు. 2022, నవంబర్‌లో మొదటిసారి రూ.73 వేల బిల్లు వచ్చిందని.. తర్వాత నెల నుంచి పెరుగుకుంటూ గతేడాది డిసెంబర్‌లో రూ.2,78,500 బిల్లు వచ్చిందని తెలిపారు. ఇంట్లో టీవీ, ఫ్యాన్, బల్బు తప్పా ఏమీ లేవని.. అయినా ఇంత మొత్తంలో బిల్లు వస్తుందని చెబుతున్నారు. ఈ సమస్యను విద్యుత్ సిబ్బందికి తెలియజేశామని.. అయినా అలాగే వస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ ఏఈ సందీప్ వద్ద ప్రస్తావించగా సాంకేతిక సమస్య కారణంగా అలా వస్తుందని.. త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు.

16 ఇళ్లలో చోరీలు

బంగారం, వెండి, నగదు అపహరణ



కొత్రలో ఘటనా స్థలాలను పరిశీలిస్తున్న పోలీసులు

వెల్దండ: కొత్రలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 16 ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలో తాళం వేసిన ఇళ్లను ఎంచుకుని గుర్తుతెలియని దుండగులు చోరీలకు పాల్పడ్డారు. ఏకంగా 16 ఇళ్లకు ఉన్న తాళాలను ధ్వంసం చేసి చోరీలు చేశారు. గ్రామానికి చెందిన కదారి పార్వతమ్మ ఇంట్లో నాలుగున్నర తులాల బంగారం, రూ.3.80లక్షల నగదు, కావటి కృష్ణయ్య ఇంట్లో రెండు తులాల బంగారం, మొగిలిశెట్టి జంగమ్మ ఇంట్లో తులం బంగారం పత్తీలు, 20 తులాల వెండి గొలుసులు, రూ. 5, 500నగదు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా భూత్కురి వెంకటమ్మ ఇంట్లో రూ.4వేలు, భూత్కురి యాదమ్మ ఇంట్లో రూ. 2వేలు, తిర్మన్ దాస్ సరోజినమ్మ ఇంట్లో రూ. 11,000వేలు, 5తులాల వెండి, కావటి తిరుపతయ్య ఇంట్లో రూ.10వేలు, 20తులాల వెండి, కొప్పు మాధవులు ఇంట్లో 14తులాల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా మొగిలిశెట్టి శ్రీరామ్, శ్రీను, బచ్చల అక్కమ్మ, పుణ్యమూర్తి కృష్ణయ్య, ఎరుకలి అంజయ్య, శ్యాంపూరి చంద్రయ్య, జంగయ్య, రామచంద్రయ్య ఇళ్ల తాళాలను ధ్వంసం చేశారు. ఇంట్లో వస్తువులను చెల్లా చెదురు చేశారు. బీరువాలను ధ్వంసం చేశారు. చోరీకి గురైన ఇళ్లను వెల్దండ సీఐ సోమనర్సయ్య, ఎస్ఐ శ్రీనివాస్‌లు పరిశీలించారు. క్లూస్‌టీంతో అక్కడ లభించిన ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

దొంగ దొరికాడు

బంగారం, నగదు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: బంగారం, నగదు చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్న ఘటన మండలపరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని భవానీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న అజ్జకొల్లుకు చెందిన రాఘవేంద్రశెట్టి, లావణ్య దంపతులు డిసెంబర్ 22న ఇంటికి తాళం వేసి వెళ్లారు. కాగా రాత్రి 11గంటల సమయంలో తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడం గమనించారు. ఇంట్లోని బీరువాలో దాచిన 3తులాల బంగారం, రూ.30వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. 23న పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేరకు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీంను పిలిపించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. వేలిముద్రలను సేకరించారు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం పట్టణంలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ యువకుడిని పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించి విచారించగా కొత్తకోటలో తనే దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నాడు. తన పేరు ఖాజాపీరా అని అనంతపురం జిల్లాలోని ధర్మవరం తాలుక అని చెప్పాడు. పోలీసులు ఇతడిపై ఇంకా ఏమైనా కేసులు ఉన్నాయా? అని ఆరా తీయగా అనంతపూర్ జిల్లాలో 8 దొంగతనం, కడప జిల్లా రాయచోటిలో 4దొంగతనాలకు సంబంధించి కేసులు ఉన్నట్టు తేలింది. ఈ మేరకు అతడి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ వివరించారు. హెడ్ కానిస్టేబుల్ కుర్మయ్య, మురళీరెడ్డి, రవి ఉన్నారు.

బిల్లు చేయడం లేదని..

ఉప సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దామోదర్

నవాబుపేట: గ్రామంలో చేసిన అభివృద్ధి పనికి సంబంధించిన బిల్లు మంజూరు కావడం లేదని.. అధికారపార్టీ నాయకులే ఇందుకు కారణమంటూ మనస్తాపానికి గురై ఉపసర్పంచ్ భర్త ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ యశోద భర్త దామోదర్ గత ప్రభుత్వ హయంలో రూ. 2.14 లక్షలతో గ్రామంలో అండర్ డ్రైన్ పనులు చేపట్టారు. తాజాగా బిల్లు చేయాలని సంబంధిత అధికారిని కోరగా.. ఎమ్మెల్యే సోదరుడు, గ్రామ కాంగ్రెస్ నేతలు బిల్లు చేయొద్దని అడ్డుపడుతుండటంతో ఆలస్యం జరుగుతోందంటూ బదులిచ్చారని, ఎమ్మెల్యేను సైతం కలవకుండా చేస్తున్నారని వివరించారు. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి అత్తగారి గ్రామం నుంచి తిరిగి వస్తూ జడ్చర్ల సమీపంలోని గంగాపూర్ వద్ద పురుగుమందు తాగాడు. ఈ విషయాన్ని భార్య, సర్పంచ్‌కు విషయం చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. బిల్లు విషయమై ఏఈ రాములు మాట్లాడుతూ.. రెండురోజుల క్రితమే ఎంబీ రికార్డు పూర్తి చేశానని వివరించారు. కుటుంబ తగాదాలతోనే దామోదర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారని.. తమకు ఎలాంటి సంబంధం లేదని గ్రామ కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

■ ఇదిలా ఉండగా.. ఎమ్మెల్యేగా లక్ష్మారెడ్డి విజయం సాధిస్తే తిరుపతికి వచ్చి గుండు కొట్టించుకొని మొక్కు తీర్చుకుంటానని.. ఒకవేళ కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి గెలిస్తే గ్రామంలోనే గుండు గీయించుకొని తిరుగుతానని శాసన సభ ఎన్నికల సమయంలో దామోదర్ గ్రామస్తుల ఎదుట వాగ్దానం చేశాడు. కాంగ్రెస్ అభ్యర్థి గెలువడంతో గుండు గీయించుకొని తిరుగుతున్నాడు. గ్రామంలో చేసిన అండర్ డ్రైన్ పనుల బిల్లు కోసం ప్రయత్నం చేస్తుండగా గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురి చేయాలని అధికారులపై ఒత్తిడి తేవటం తీరా అతడి ఆత్మహత్యా యత్నానికి దారి తీసిందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

'ప్రజాపాలన' కోసం గ్రామానికి వచ్చి..



మహేష్‌నాయక్ (ఫైల్)

పాన్‌గల్: ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన ముడావత్ మహేష్‌నాయక్(19), గౌతమ్‌నాయక్ పని నిమిత్తం బైక్‌పై వనపర్తి నుంచి తండాకు బయలుదేరారు. ఈ క్రమంలో బండపల్లిస్టేజీ సమీపంలో కొల్లాపూర్ డిపో ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో మహేష్‌నాయక్ అక్కడిక్కడే మృతిచెందగా, గౌతమ్‌నాయక్ బైక్‌పై నుంచి రోడ్డుపై పడటంతో రెండు కాళ్లు విరగగా, తలకు బలమైన గాయమైంది. బైక్‌పై వెళ్తున్న బండపల్లికి చెందిన ఆంజనేయులు బస్సు వెనుకవైపు ఢీకొనడంతో ఆయనకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్‌లో జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించగా గౌతమ్‌నాయక్‌కు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుని తల్లి చాంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ఘటనా స్థలం వద్ద వివరాలను సేకరిస్తున్న ఎస్ఐ వేణు

మృతుడు హైదరాబాదులో పనులు చేసుకుంటూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసేందుకు స్వగ్రామానికి వచ్చి మృత్యువాత పడటంతో కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెలకపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. మండలంలోని గట్టునెల్లికుదురుకు చెందిన జలపటి మల్లయ్య(45) కడుపునొప్పి భరించలేక ఈ నెల 4వ తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయన్ను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా, శుక్రవారంరాత్రి మృతి చెందాడు. భార్య ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా...



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్ బిందాల్(పై చిత్రం), తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ శనివారం దర్శించుకున్నారు.



దరిగాం అడవుల్లో పులి హతం?

కాగజ్‌నగర్‌రూరల్: కుమురంభీం జిల్లా కాగజ్ నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో శనివారం పులి హతమైనట్లు తెలిసింది. రెండు పులుల మధ్య జరిగిన ఘర్షణలో ఆడపులి మృతిచెందినట్లు తెలిసింది. దరిగాం అటవీ ప్రాంతం దట్టంగానూ, ఆవాసానికి అనుకూలంగానూ ఉండడంతో ఇక్కడ పులుల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలోనే పోటీ తత్వంతో రెండు పులుల మధ్య ఘర్షణ జరిగినట్లు ఫారెస్టు అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ విషయమై వివరాలు వెల్లడించే విషయంలో గోప్యంగా వ్యవహరిస్తున్నారు.

పొద్దుపొద్దునే ప్రయాణాలొద్దు!

➤ మొదటి పేజీ తరువాయి

పోలీసులు తెలిపారు.

➤ 25 డిసెంబర్, 2023న నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వేంపాడు వద్ద రాత్రి 10 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 ఏండ్ల యువకుడు రమావత్ శివనాయక్ ద్విచక్రవాహనంతో 55 ఏండ్ల బల్లూరి సైదులు అనే వ్యక్తిని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న మృతుడు శివనాయక్ బంధువులు టాటాఏస్ వాహనంలో ప్రమాద ఘటన స్థలానికి బయలుదేరారు. తెల్లవారుజామున 3గంటల సమయంలో వారు ప్రయాణిస్తున్న టాటాఏస్ వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ నిడమనూరు మండలం 3వ నంబర్ కెనాల్ వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. దట్టమైన పొగమంచు కారణంగానే ఈ వరుస ప్రమాదాలు జరిగినట్టు పోలీసులు పేర్కొన్నారు.

➤ డిసెంబర్ 31న తెల్లవారుజామున జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్సు, డీసీఎం ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ చనిపోగా, ఆర్టీసీ బస్ డ్రైవర్‌తోపాటు ఆ బస్సులోని మరో 10మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పొగమంచుతో రోడ్డు సరిగా కనిపించకపోవడంతోనే ప్రమాదం జరిగినట్టు తెలిపారు.

➤ డిసెంబర్ 25న హైదరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లా అనంతగిరి ఔటింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న మిత్రుల బృందం కారు పొగమంచు కారణంగా రోడ్డు పక్కన ఉన్న శివారెడ్డిపేట్ చెరువులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ఒకరు గల్లంతు కాగా, మిగిలిన నలుగురిని స్థానికులు కాపాడారు.

ప్రయాణం తప్పనిసరైతే ఇవి మరవొద్దు

➤ పొగమంచు కురుస్తున్నప్పుడు మీకు కేటాయించిన లేన్‌లోనే వాహనం నడపాలి. వీలైనంత వరకు ఓవర్‌టేక్ చేయకపోవడమే ఉత్తమం.

➤ సింగిల్ రోడ్డులో వాహనం నడపాల్సి వస్తే.. వీలైనంత వరకు మీ వాహనం ఎడమవైపు ఉండేలా చూసుకోవాలి.

➤ డ్రైవింగ్ సమయంలో ఏ సంశయం ఉన్నా.. రోడ్డు పూర్తిగా కనిపించకపోయినా మీ వాహనాన్ని రోడ్డు పక్కకు నిలపడమే ఉత్తమం. మీరు వాహనాన్ని పార్క్ చేసినట్టుగా సూచిస్తూ పార్కింగ్ లైట్లు వేయాలి.

➤ పొగమంచు వాతావరణం ఉన్నప్పుడు వాహన వేగాన్ని వీలైనంత వరకు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎదుటి వాహనం కనిపించని పరిస్థితుల్లో వేగంగా వెళితే వాహనాన్ని కంట్రోల్ చేయడం కష్టం. అదేవిధంగా ప్రమాద తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది.

➤ పొగమంచు కురుస్తున్నప్పుడు డ్రైవర్లు సాధారణంగా హైబీంలో లైట్లు పెడతారు. ఇలా చేయడం వల్ల రిఫ్లెక్షన్ వల్ల డ్రైవర్‌కు సరిగా కనిపించదు. విజిబిలిటీ 100 మీటర్లలోపు ఉన్నట్లయితే హెడ్‌లైట్లు లోబీంలో ఉంచాలి. మీ వాహనానికి ఫాగ్ ల్యాంప్‌లు ఉంటే వాటిని తప్పక ఆన్ చేయాలి.

➤ ఎదుటి వాహనదారుడిని అప్రమత్తం చేసేలా మీ వాహనానికి ఇండికేటర్లు వేసు కుని వెళ్లడం ఉత్తమం.

➤ మీ వాహన అద్దాలు వీలైనంత వరకు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. మీ కారులోని డీఫాగర్‌ను ఆన్ చేసుకోవాలి.

➤ వీలైనంత వరకు ఎదురుగా ఉన్న రోడ్డు స్పష్టంగా కనిపించేలా అవసరం మేరకు డ్రైవింగ్ సీట్‌ను సర్దుబాటు చేసుకోవాలి.

➤ పొగమంచు ఉన్నప్పుడు వాహనం ఒక్క క్షణం అదుపు తప్పి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి డ్రైవింగ్‌పైనే దృష్టి పెట్టాలి. నిద్రమత్తు లేకుండా జాగ్రత్త పడాలి.

➤ వాహనం పూర్తి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలి. టైర్లు, బ్రేక్‌లు ముందుగానే చెక్ చేసుకోవాలి. మీ కారులోని హీటర్ ఆన్ చేయాలి. దీనివల్ల బయటి పొగమంచుతో అద్దంపై ప్రభావం లేకుండా ఉంటుంది.

➤ లేన్ మారుతున్నప్పుడు, మూల మలుపుల వద్ద తప్పకుండా హారన్ మోగించాలి.

➤ మొబైల్ ఫోన్ వాడడం, రేడియోలో ఎఫ్‌ఎం వినడం, పాటలు వింటూ డ్రైవ్ చేయవద్దు.

కాంగ్రెస్‌లో షర్మిల చేరడం వెనుక చంద్రబాబు కుట్ర

- అధికారం ఇక కలే అని గ్రహించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు
- దింపుడుకళ్లం ఆశలతో రకరకాల కుట్రలు
- సంక్షేమ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం
- కాంగ్రెస్‌కు గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లు
- ఉనికిలోలేని కాంగ్రెస్‌లో ఎవరు చేరినా మాకేమీ నష్టం లేదు
- వైఎస్సార్‌సీపీని ఆదిలోనే తుంచేయడానికి కాంగ్రెస్, టీడీపీ కుట్ర
- అప్పుడే ఏం చేయలేని వారు.. ఇప్పుడేం చేస్తారు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: కాంగ్రెస్‌లో షర్మిలమ్మ చేరడం వెనుక టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కుట్ర ఉందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఇక అధికారం కలే అని గ్రహించిన చంద్రబాబు.. దింపుడుకళ్లం ఆశలతో ఈ కుట్రకు పాల్పడ్డారని మండిపడ్డారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌ను చేతిలో పెట్టుకున్న చంద్రబాబు.. తన మనుషుల ద్వారా ఒక వైపు కాంగ్రెస్‌ను.. మరో వైపు బీజేపీని మేనేజ్ చేస్తున్నారని, మీడియా ద్వారా ప్రజల దృష్టి మళ్లించేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన మంచి ఏమీ లేకపోవడంతో ఇప్పుడేమీ చెప్పుకోలేక ఇప్పుడు రకరకాల కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఆ కుట్రలో భాగంగానే షర్మిలమ్మ కాంగ్రెస్‌లో చేరికన్నారు. షర్మిలమ్మ సీఎం రమేశ్ విమానంలో వెళ్లడం.. టీడీపీ నేత బీటెక్ రవిని బ్రదర్ అనిల్ కలవడం యాదృశ్చికమని తాము అనుకోవడం లేదన్నారు. క్రిస్టియన్ ఓట్లను ప్రభావితం చేయడానికి కుట్రలు చేస్తున్నారంటూ గతంలో ఇదే టీడీపీ నేతలు బ్రదర్ అనిల్‌పై ఏ స్థాయిలో దుమ్మెత్తిపోశారో అందరికీ గుర్తుందన్నారు. టీడీపీ నేత బీటెక్ రవిని ఎయిర్‌పోర్ట్‌లో బ్రదర్ అనిల్ మర్యాదపూర్వకంగా కలవడం వంటి వాటన్నింటినీ పరిశీలిస్తే షర్మిలమ్మ కాంగ్రెస్‌లో చేరడం వెనుక చంద్రబాబు కుట్ర ఉందన్నది అర్థమవుతోందన్నారు.

కాంగ్రెస్‌లో ఎవరు చేరినా నష్టం లేదు..

రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి, పార్టీ పెట్టి, తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం ద్వారా ఆపార్టీలో చేరడం షర్మిలమ్మ ఇష్టమని సజ్జల అన్నారు. అండమాన్ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకూ ఎక్కడైనా పనిచేస్తానని ఆమె అన్నారని, రాష్ట్రంలోనే రాజకీయం చేస్తానని ప్రకటించలేదన్నారు. ఒకవేళ రాష్ట్రానికి వస్తే కాంగ్రెస్ నాయకురాలిగానే తాము చూస్తామన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయని.. అలాంటి పార్టీ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదన్నారు. రాష్ట్రంలో ఉనికేలేని కాంగ్రెస్ పార్టీలో ఎవరు చేరినా తమకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు.

అప్పట్లో కాంగ్రెస్, టీడీపీ కలసి కుట్ర..

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణంపై కాంగ్రెస్‌కు సంబంధించి తమకు అనుమానాలు ఉన్నాయని సజ్జల పునరుద్ఘాటించారు. వైఎస్ మరణం తర్వాత అప్పట్లో కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం టీడీపీ కుమ్మక్కై జగన్‌పై తప్పుడు కేసులు పెట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీని స్థాపించాక కడప లోక్‌సభ, పులివెందుల శాసనసభ ఉప ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను, వైఎస్ విజయమ్మను ఓడించటం ద్వారా పార్టీని మొగ్గలోనే తుంచేయడానికి అప్పటి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష టీడీపీ కుమ్మక్కై కుట్ర చేశాయన్నారు. పులివెందుల ఉపఎన్నికలో వైఎస్ విజయమ్మపై వైఎస్ వివేకాను పోటీకి పెట్టారని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో వైఎస్ విజయమ్మ 80 శాతం ఓట్లు సాధించి ఘనవిజయం సాధిస్తే.. కడప లోక్‌సభ స్థానం నుంచి జగన్ రికార్డు మెజార్టీతో విజయం సాధించారన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే వైఎస్సార్‌సీపీపై కుట్ర చేసి బొక్కబోర్లా పడ్డ చంద్రబాబు, కాంగ్రెస్ ఇప్పుడు ఏమీ చేయలేరని స్పష్టం చేశారు.

ఆది నుంచి కాంగ్రెస్‌తోనే చంద్రబాబు..

మహానేత వైఎస్ మరణించినప్పటి నుంచి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తెరవెనుక కాంగ్రెస్‌తో సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారని సజ్జల ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌ను ఎన్నికల్లో నేరుగా ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని.. ఆ కుట్రలో భాగంగానే షర్మిల చేరికని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో జరగబోయే డ్రామా అంతా చంద్రబాబు ఆధ్వర్యంలోనే జరగనుందన్నారు. ప్రజా సమస్యలపై కాకుండా.. ప్రజలకు సంబంధం లేని సంచలనాలు సృష్టించడమే చంద్రబాబు నైజమన్నారు.

అభ్యర్థుల మార్పు సహజమే..

ఎన్నికల్లో అభ్యర్థుల మార్పుపై అన్ని పార్టీల్లోనూ సహజ ప్రక్రియేనని సజ్జల ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా సమన్వయకర్తలను మారుస్తున్నారని చెప్పారు. వివిధ వర్గాల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయం, ప్రజల ఆకాంక్షలు, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని.. అందరితో చర్చించే అవసరమైన చోట్ల సమన్వయకర్తలను మార్చుతున్నామని చెప్పారు. సీఎం జగన్ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారని.. వ్యక్తిగత కారణాలతోనే కొందరు పార్టీని వీడుతున్నారని స్పష్టం చేశారు.

టీడీపీని వదిలేస్తున్నా..

విజయవాడ ఎంపీ కేశినేని నాని

- దొంగే.. దొంగ.. దొంగ.. అన్నట్లుగా చంద్రబాబు తీరు
- ఆ పార్టీకి ఎంతో సేవ చేశా.. నన్ను పొమ్మంటున్నారు
- ఆ పార్టీలో కొనసాగడంలో అర్థం లేదు
- ఇతర పార్టీల నేతలతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటే తప్పా?
- ముందుగా ఎంపీ పదవికి రాజీనామా.. ఆ తరువాత టీడీపీకి రాజీనామా
- అభిమానులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడి



సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'దొంగే.. దొంగ.. దొంగ..' అన్నట్లుగా ఉంది చంద్రబాబు తీరు. ఇక తెలుగుదేశం పార్టీలో ఉండను. ఆ పార్టీని వదిలేస్తున్నా' అంటూ విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) సంచలన ప్రకటన చేశారు. రెండుసార్లు ఎంపీగా చేసి, పార్టీకి ఎంతో సేవ చేసిన తనను చంద్రబాబు పొమ్మన్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి పనుల్లో పాల్గొంటున్నాననే సాకుతో తనను పార్టీ నుంచి దూరంగా పెట్టారని వాపోయారు. ఎంపీ నాని శనివారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో రూ. 25 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాని మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు తాను కొనసాగిన టీడీపీని వదిలేస్తున్నానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "నేను టీడీపీని వదిలేస్తున్నా. ఆ పార్టీకి నా అవసరం లేనప్పుడు.. నేను అందులో కొనసాగడంలో అర్థం లేదు. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ అపాయింట్‌మెంట్ తీసుకున్నా. ముందుగా ఢిల్లీ వెళ్లి ఎంపీ పదవికి రాజీనామా లెటర్ స్పీకర్‌కు ఇచ్చి, ఆమోదింపజేయించుకుని వస్తా. ఆ వెంటనే తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తా' అని చెప్పారు. ప్రజా అభివృద్ధి పనుల్లో ఇతర పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొంటే తప్పేమిటని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రధాన నరేంద్ర మోదీని కలుసుకున్న వైనాన్ని ఉదహరిస్తూ.. 'ప్రధానిని కలుసుకున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ నాయకుడు అయిపోతాడా? ఒక పార్టీ నాయకులు మరో పార్టీ నాయకులతో కలిసి పర్యటించకూడదని రాజ్యాంగంలో రాసుందా?' అంటూ బాబును ప్రశ్నించారు.

పార్టీ మార్పు నిర్ణయాధికారం అభిమానులదే

భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ, ఏ పార్టీలోకి వెళ్లాలో తన అభిమానులకే వదిలేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తనకు అభిమానులున్నారని, తనపై ఎంతో మంది ఆధారపడి ఉన్నారని అన్నారు. ఎంపీ పదవితో రాజకీయాలను వదిలేసి విశ్రాంతి తీసుకుందామనుకున్న తన తన నిర్ణయాన్ని అభిమానులు వ్యతిరేకించారన్నారు. ముందుగా టీడీపీకి రాజీనామా చేస్తానని ప్రకటించారు. అభిమానులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ వెల్లడిస్తానని చెప్పారు. అభిమానులు ఏ పార్టీకి జై కొడితే అదే పార్టీలో చేరతానని స్పష్టం చేశారు.

ఈనాడు వార్తలు సరైనవి కావు

రాజకీయాలంటే త్యాగమని ఎంపీ నాని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అవుతున్నానని ఇటీవల ఈనాడు పత్రికలో రాశారని, అలాంటి వార్తలు సరైనవి కావని అన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు రోడ్డు అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చానని, ఎమ్మెల్యేతో కలిసి పాల్గొంటే తప్పేమిటని అన్నారు. ఎవరితో కలిసి పాల్గొనాలో ఈనాడే నిర్ణయిస్తుందా అని ప్రశ్నించారు.

ప్రత్యేక అలంకణలో అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో కాకర్లపహాడ్ మైసమ్మ దేవత

నవాబుపేట: మైసమ్మ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారి అలంకరణ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరణ చేశారు. వారం రోజులు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ప్రత్యేకంగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ కృష్ణయ్య, దేవాలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం అమ్మవారు కవచధారణలో శత్రుసంహరా అవతారంతో పులిపై స్వారీ చేస్తూ భక్తులకు దర్శనం ఇస్తారని నిర్వాహకులు తెలిపారు.

10 నుంచి కృష్ణా బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత

కృష్ణా: రాష్ట్ర సరిహద్దులోని కృష్ణా బ్రిడ్జిపై ఈనెల 10నుంచి వాహనాల రాకపోకలను నిలిపి వేయనున్నట్లు రాయచూర్ డీఎస్పీ సత్యనారాయణరావు వెల్లడించారు. శక్తినగర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సరిహద్దులోని పోలీస్‌స్టేషన్ల అధికారులతో పాటు ఎన్‌హెచ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కృష్ణా బ్రిడ్జి మరమ్మతు నిమిత్తం 45 రోజుల పాటు రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలను గద్వాల మీదుగా మళ్లించనున్నట్లు చెప్పారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో శనివారం పూర్తి నీటి మట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 255 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేసారు. ఎన్టీఆర్‌కు నీటిని ఆపేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

నకిలీ'లీలలు'..!

గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వైద్యశాలల ఏర్పాటు

- అర్హత లేకుండా చికిత్సలు
- ప్రజారోగ్యంతో చెలగాటం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



గండేడ్/మహమ్మదాబాద్: ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గ్రామాల్లో ఎలాంటి అర్హత లేని వైద్యులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. పల్లెల్లో ఇబ్బడిముబ్బడిగా క్లీనిక్‌లు ఏర్పాటు చేసుకొని స్థాయికి మించిన వైద్యం అందిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అక్రమార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

జిల్లాలో ఇలా..

■ మహబూబ్‌నగర్ జిల్లాలో జిల్లా జనరల్ ఆస్పత్రితో పాటు 3 కమ్యూనిటీ ఆస్పత్రులు, 26 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు 182 సబ్‌సెంటర్లు ఉన్నాయి. వీటితోపాటు వైద్యవిద్యను అభ్యసించి ప్రైవేటుగా ఆస్పత్రులు నిర్వహిస్తున్న వారు అనేకం. ఇవేగాకుండా గ్రామాల్లో ఆర్‌ఎంపీల పేరుతో వైద్యశాలలు వెలుస్తున్నాయి. పెద్దపెద్ద గ్రామాల్లో వీధికో ఆర్‌ఎంపీ వైద్యశాలలు ఉంటున్నాయి. వీరంతా మెడలో స్టెతస్కోప్ వేసుకొని వైద్యులుగా చలామణి అవుతున్నారు. సాధారణంగా ఎంబీబీఎస్, ఆపై స్థాయి శిక్షణ పూర్తిచేసిన వారు ఇంజెక్షన్ ఇవ్వడం, సెలైన్ పెట్టడంగాని చేయాలి.. కానీ ఇవేమీ లేని వారు నర్సింగ్‌హోమ్ తరహాలో ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్సలే చేయాలి. అలాగాకుండా ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఇంజక్షన్లతో పాటు సెలైన్లు, అధిక మొత్తంలో మందులు కూడా రాస్తున్నారు.

వికటిస్తున్న వైద్యం..

మంగంపేటతండాకు జాన్యానాయక్ ఇటీవల దుబాయ్ నుంచి వచ్చాడు. ఒళ్లు నొప్పులు ఉన్నాయని మహమ్మదాబాద్‌లోని ఓ ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లారు. పరీక్షించిన ఆయన ఇంజక్షన్‌తో పాటు మందులు ఇచ్చారు. అవి వాడిన కొద్దిసేపటికే నోటిలో ఎర్రటి గుల్లలు కావడంతో పాటు పాదాలపై బొబ్బలొచ్చాయి. వాంతులు కావడంతో నీరసించి నిలబడలేని స్థితికి చేరుకున్నారు. గుర్తించిన కుటుంబీకులు వెంటనే మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అటు నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి వాడిన మందులు వికటించడంతోనే ఇలా జరిగిందని చెప్పారని బాధితుడి సోదరుడు పాండునాయక్ తెలిపారు. చికిత్సకుగాను రూ.2.50 లక్షలకుపైగా ఖర్చు అయిందని వివరించారు.

■ గతంలో నంచర్లలో ఓ వృద్ధుడికి ఆర్‌ఎంపీ వైద్యం అందించగా చర్మం ఊడిపోయింది. బయటకు వెళ్లి వైద్యం చేయించుకోలేని స్థితికి చేరి మంచంపట్టి కొన్నాళ్లకు మృతిచెందాడు.

అక్రమార్జనే ధ్యేయంగా...

ఆర్‌ఎంపీలు ఎక్కువ శాతం అక్రమార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారు. చికిత్సకు తక్కువ ఫీజు తీసుకున్నా.. మెడికల్ దుకాణాల నిర్వాహకులతో కుమ్మక్కై కమీషన్లు తీసుకుంటున్నారు. అవసరం లేకున్నా రూ.వందలు, వేలల్లో మందులు రాస్తున్నారు. ఏవైనా శస్త్రచికిత్సలు, వైద్య పరీక్షలు ఉంటే పట్టణాల్లోని ఆస్పత్రులు, ల్యాబ్‌లకు రెఫర్ చేస్తూ కమీషన్లు దండుకుంటున్నారు.



జాన్యానాయక్ ముఖంపై బొబ్బలు



కందిపోయిన కాళ్లు

చర్యలు తీసుకుంటాం..

మహమ్మదాబాద్‌లో ఆర్‌ఎంపీ నిర్వాకంతో జాన్యానాయక్ ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన విషయం తమ దృష్టికి వచ్చింది. ఈ విషయమై సిబ్బందిని విచారణకు పంపించాం. వారిచ్చే నివేదిక ఆధారంగా ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకుంటాం.

– కృష్ణ, డీఎంహెచ్‌ఓ, మహబూబ్‌నగర్

అయోధ్య రాముడి అక్షతల ఊరేగింపు



అక్షతల ఊరేగింపులో కోలాటం వేస్తున్న చిన్నారులు



గుమ్మడికాయ కొట్టి ఆహ్వానిస్తున్న జోగుళాంబ ఆలయ చైర్మన్, ఈఓ

అలంపూర్‌లో శోభాయాత్ర.. తరలివచ్చిన భక్తజనం

జోగుళాంబ శక్తిపీఠం: అయోధ్య రాముడి అక్షతలు శనివారం అలంపూర్ జోగుళాంబ ఆలయానికి చేరుకున్నాయి. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్యభక్తులు, భక్తుల జైశ్రీరాం నామస్మరణల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. భక్తుల కోలాట నృత్య ప్రదర్శనాలు, మంగళవాయిద్యాలు, భజనలు, నగరసంకీర్తల నడుమ ఊరేగింపు సాగడంతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. జోగుళాంబ ఆలయం వద్ద చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఈఓ పురేందర్‌కుమార్ గుమ్మడి కాయ కొట్టి ఘన స్వాగతం పలికారు. అయోధ్య రాముడి అక్షతల విశిష్టతను విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఫణిమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు గద్దం బ్రహ్మేశ్వర్‌రెడ్డి వివరించారు. అయోధ్య రామ జన్మభూమి అక్షతలు అలంపూర్‌కు చేరుకోవడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని వాఖ్యాత వెంకట్రామయ్యశెట్టి అన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన భక్తులకు అక్షతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, కూచుకుళ్ల యాదగిరిరెడ్డి, కృష్ణమూర్తి, జగదీష్, కేకే సత్యం, చిల్కూరు శ్రీనివాస్, వేణుగోపాల్‌శెట్టి, సతీష్, ఫణిభూషణ్, రవి పాల్గొన్నారు.

22న ప్రతి ఇంటా జ్యోతులు వెలిగించండి



మాట్లాడుతున్న డీకే అరుణ

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

పాలమూరు: అయోధ్యలో విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి అని నామకరణం చేయడం దానిని మోడీ ప్రారంభించారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తెలిపారు. అయోధ్యలో మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయమని నామకరణం చేసినందుకు శనివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో మోడీకి కృతజ్ఞత శోభాయాత్ర నిర్వహించారు. గత ప్రభుత్వాలు ఎయిర్‌పోర్ట్‌లకు వారి కుటుంబ సభ్యుల పేర్లు పెట్టారని, బీజేపీ అధికారంలో ఉండటం మోడీ ప్రధానిగా ఉండటం వల్లే మహనీయుడి పేరు పెట్టారన్నారు. అయోధ్యలో రాముడి మందిరం నిర్మాణం కోసం కొన్ని వందల ఏళ్లుగా ఉన్న సమస్యను మోడీ ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. ఈనెల 22న బాల రాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని, ఇందులో భాగంగా ప్రతి ఇంటిలో రామ జ్యోతులు వెలిగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మిథున్‌రెడ్డి, తెలంగాణ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కురుమయ్య, జనార్దన్, లక్ష్మీనారాయణ, పొన్నకల్ కృష్ణయ్య పాల్గొన్నారు.

సోమశిలలో ప్రైవేటు రెస్టారెంట్ కూల్చివేత



సోమశిలలో రెస్టారెంట్‌ను కూల్చివేస్తున్న జేసీబీ

కొల్లాపూర్ రూరల్: సోమశిల కృష్ణానది ఒడ్డున టూరిజం కాటేజీల సమీపంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు రెస్టారెంట్‌ను శనివారం అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ సమక్షంలో పంచాయతీ సిబ్బంది కూల్చివేశారు. వివరాల్లోకి వెళ్తే.. సోమశిలకు చెందిన ముగ్గురు అన్నదమ్ముళ్లు 900 గజాల స్థలంలో భవన నిర్మాణానికి 2022లో దరఖాస్తు చేసుకోగా.. గ్రామపంచాయతీ అనుమతి ఇచ్చింది. వారిలో ఆంజనేయులు అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా మూడు అంతస్తుల భవనం నిర్మించగా.. గ్రామపంచాయతీ నుంచి పలుమార్లు నోటీసులు జారీ చేశారు. అతడి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కూల్చివేత పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మూడవ అంతస్తు తొలగింపునకు మూడు రోజుల సమయం ఇచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీఓ నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి శర్మ ఉన్నారు.

నిల్చున్న లారీని ఢీకొట్టిన మరో వాహనం

- డ్రైవర్ మృతి, ఇద్దరికి గాయాలు



శంకరప్ప (ఫైల్)

జడ్చర్ల: రోడ్డుపై నిలిపిన లారీని వెనుక నుంచి మరో వాహనం ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం నిడుగుర్తికి చెందిన శంకరప్ప గూడ్స్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వరంగల్ జిల్లా నుంచి గొర్రెలను బొలెరో వాహనంలో లోడ్ చేసుకుని తమ గ్రామానికి బయలుదేరాడు. జడ్చర్ల వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిలిపిన లారీని వెనుక నుంచి బొలెరో ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకరప్ప (36) మృతి చెందగా వాహనంలో ఉన్న కుర్వ నర్సింహులు, రాములు తీవ్రంగా గాయపడ్డారు. వాహనంలో ఉన్న 30 గొర్రెలు మృతి చెందాయి. జాతీయ రహదారిపై లారీని నిర్లక్ష్యంగా నిలపడం వల్లనే ప్రమాదం చోటు చేసుకుందని మృతుడి భార్య కుర్వలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తికి చెందిన డ్రైవర్ కుర్వ శంకర్ (33) అలియాస్ శంకరప్ప మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాటికి శ్రీహరి సాయంత్రం గ్రామానికి వచ్చి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా అన్ని విధాల సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.